

# ప్రేమ రహస్యం

‘ప్రవాసి’

సమీపగ్రామాల్లో ధర్మ ప్రచారం చేసి, ఆర్తుల్ని ఓదార్చి తిరిగివచ్చి విడిదిలో తమ శిష్యుల మధ్య శయనించి విశ్రాంతి తీసుకుంటున్నారు మహాత్మ జీసస్‌క్రైస్తు.

పరిసర గ్రామాల నుంచి కొంతమంది మాతృమూర్తులు బిడ్డలనెత్తుకుని జీసస్ సందర్శనార్థం ఒచ్చారు. శిష్యులు విశ్రాంతి తీసుకుంటున్న జీసస్ దగ్గరకు వెళ్ళనివ్వకుండా వాళ్ళని అడ్డుపెట్టారు.

“వారిని నా దగ్గరకి రానివ్వండి. అడ్డుపెట్టకండి. ఈశ్వరప్రేమ సామ్రాజ్యంలో అడుగుపెట్టడానికి ఈ తల్లుల ఒడిలో నిదరపోతున్న శిశువులకి మల్లే సరళంగా అమాయకంగా ఉండాలి. సాధకులెలా వుండాలో వాళ్ళు చెప్పీ చెప్పకుండా చెబుతున్నారు. ఆ బిడ్డలు తల్లుల యెడల శంకలేని విశ్వాసంతో ప్రేమతో నిశ్చల నిద్రలో ఉన్నారు. వాళ్ళు భగవత్ప్రేమ నిర్మలమూర్తులు” అంటూ జీసస్ ఆ బిడ్డల్ని తమ ఒడిలో కూచుండపెట్టి వారిని ఎంతో దయతో, ప్రేమతో, స్నేహంతో లాలించారు.

“ఈశ్వరుడు ప్రేమమయుడు. ప్రభువు దివ్యప్రేమరాజ్యంలో ప్రవేశించడానికి సాధనం ప్రేమే. కేవలం ప్రేమే. పసిబిడ్డల్లా నిష్కపట నిర్మల అమాయక హృదయంతో ఈశ్వరుడ్ని ప్రేమించాలి. ఆరాధించాలి” అంటూ . జీసస్ తను అంతేవాసులకు భగవత్ప్రేమ రహ స్యాన్ని ఎరుక పరిచారు.

విఖ్యాత మహాత్ములు రామ కృష్ణ పరమ హంస కూడా సాధకులెలా వుండాలో చెబుతూ “శిశోర్మాతే సరల్ హోవే, ఫూలోర్మాతే పబిత్ర్ హోవే” (శిశువులా సరళంగా పువ్వుల్లా పవిత్రంగా వుండాలి) అని చెప్పారు.

(మాతృ శ్రీ సొరిన్‌గారి జీసస్ జీవితం ఆధారంతో)

# స్వీకృతి

నిజమైన మహాత్ములు నిందాస్తుతులని ఒకలాగే స్వీకరించి అన్నిటికి అతీతంగా జీవిస్తారు. మహాత్మ హుస్సేన్ సమకాలికులు పరమతపస్వి మాలిక్‌దీనార్ అత్యంత సరళ పవిత్ర హృదయులు. ఒకరోజు వారి కుటీరం ముందునించి నడిచి వెడుతున్న ఒక స్త్రీ వారిని “కపటీ” అని పిలిచింది. వెంటనే మాలిక్ దీనార్ ఆదరవినమ్రభావంతో “ఇన్నేళ్ళలో నా నిజమైన పేరుతో పిలిచినదానివి నీవే చెల్లెమ్మా. నువ్వు నన్ను సరిగా గుర్తుపట్టావు” అన్నారు. వారి మాటలతో అవాక్కయిన స్త్రీమూర్తి ఎంతో పశ్చాత్తాపంతో వారిని క్షమించమని ప్రార్థించి నమస్కరించి వెళ్ళిపోయింది.

(జనశ్రుతి)



